'ఆసియాలోనే
అత్యుత్తమ
సంఘంగా పేరున్న
ములకనూర్
సహకార సంఘాన్ని ఇతర సహకార
సంఘాలు ఆదర్శంగా తీసుకుని
అభివృద్ధి చెందాలి..'



- హైదరాబాద్‌లో గురువారం జరి
గిన గ్రామజ్యోతి సదస్సులో
ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు

31-7-15

ఆంధ్రజ్యోతి    సకలం

# పల్లెల అభివృద్ధే లక్ష్యంగా..

(ఆంధ్రజ్యోతి, కరీంనగర్)

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న గ్రామ జ్యోతి కార్యక్రమంతో పల్లెల్లో వెలుగులు నిండనున్నాయి. గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల చేపట్టేందుకు ఆయా శాఖల ద్వారా మంజూరయ్యే నిధులను ఇక నుంచి గ్రామ పంచాయతీల ద్వారానే వెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం ద్వారా వచ్చే ఐదేళ్లకు ప్రణాళికలు రూపొందించి 25 వేల కోట్ల రూపాయల నిధులను వెచ్చించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. విధివిధానాలను ఖరారు చేసేందుకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కేటీఆర్ అధ్యక్షతన మంత్రులు ఈటెల రాజేందర్, టీ హరీష్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, జోగు రామన్న సభ్యులుగా కమిటీ వేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ ఈ నెల 30వ తేదీ నాటికి విధివిధానాలను తయారు చేయాల్సి ఉండగా, సీఎం కేసీఆర్ గురువారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జడ్పీ సీఈఓలు, పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించి పథకం అమలు కోసం సలహాలు, సూచనలను స్వీకరించారు. గత ఏడాది ప్రభుత్వం మన ఊరు- మన ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామాభివృద్ధికి అవసరమయ్యే ప్రణాళికలను రూపొందించిన విషయం తెలిసిందే. వాటి విలువ కోట్ల రూపాయల్లో ఉండడంతో ప్రాధాన్యం కింద గ్రామానికి 3 పనులను గుర్తించి ప్రభుత్వానికి పంపించారు. ఇందులో ఆయా శాఖలకు కేటాయించిన నిధుల నుంచి కొన్ని పనులు మంజూరు కాగా, మరికొన్ని మంజూరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం బీఆర్‌జీఎఫ్, తదితర పథకాలను ఎత్తి వేయడంతో గ్రామాలకు నిధులు రాని పరిస్థితి నెలకొంది.

## ● కేరళ రాష్ట్రం స్ఫూర్తిగా..

ఈ నేపథ్యంలో గ్రామాలను అభివృద్ధి చేసేందుకు గ్రామ జ్యో తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కేరళ రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలన్నింటినీ గ్రామ పంచాయతీల ద్వారానే అమలు చేస్తున్నారు. ఆ తరహాలో రాష్ట్రంలోనూ గ్రామాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది.

## ● గ్రామ సభల ద్వారా పనులకు ఆమోదం..

ప్రస్తుతం పంచాయతీలకు 14వ ఆర్థిక సంఘం నిధులు, సీనరేజీ, పర్‌క్యాపిటా వంటి నిధులు మాత్రమే వస్తున్నాయి. ఇతరత్రా జరిగే పనులు ఆయా శాఖల ద్వారా అమలవుతున్నాయి. వీటిన్నింటినీ పంచాయతీ పరిధిలోకి తీసుకువచ్చి, ప్రతిపాదనలు గ్రామసభలో పెట్టి ప్రజల ఆమోదం తీస్కుకుని పనులు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ పనులన్నింటికీ పంచాయతీ పాలక వర్గాన్ని బాధ్యులను చేయాలని చూస్తున్నది. నిధుల వ్యయానికి సర్పంచ్ సహా వార్డు సభ్యుడు కానీ, పంచాయతీ కార్యదర్శితో కానీ జాయింట్ చెక్ పవర్‌ను కల్పించే అవకాశాలున్నాయి. ఏడాదికి ఒక్క పంచాయతీకి 2 నుంచి 5 కోట్ల రూపాయల నిధులను కేటాయించే అవకాశాలున్నాయి. మిషన్ కాకతీయ, వాటర్ గ్రిడ్, తదితర పథకాల కింద చేపట్టే పనుల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో విధివిధానాలు ఖరారు చేసిన తర్వాత ఆగస్టు 17 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి సమగ్ర ప్రణాళికలు రూపొందించనున్నారు. ఆగస్టు 15న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ జిల్లా గంగదేవిపల్లిని సందర్శించి అక్క డ జరిగే గ్రామసభలో పాల్గొననున్నారు. గ్రామ జ్యోతి గ్రామసభల నిర్వహణకు ఒక్కో గ్రామానికి మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో నిర్వహించాలని, పర్యవేక్షణకు మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారులను నియమించాలని సీఎం ఆదేశించారు. గురువా రం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి జిల్లా కలెక్టర్ నీతూ కుమారి ప్రసాద్, జేసీ పౌసుమి బసు, జడ్పీసీఇఓ సూరజ్ కుమార్, డీపీఓ కుమారస్వామి హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా సమాచారాన్ని సీఎం తీసుకోవడంతో పాటు భీమదేవరపల్లి ముల్కనూర్ సహకార సంఘం ప్రస్తావనను తీసుక వచ్చారు. ఆసియాలోనే అత్యుత్తమ సంఘంగా పేరుగాంచిన ముల్కనూర్ సహకార సంఘాన్ని ఇతర సహకార సంఘాలు ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి చెందాలన్నారు. గ్రామసభల్లో ప్రణాళికలు రూపొందించడంతో పాటు పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే మార్గాల ను పెంచుకోవాలని సూచించారని అధికారులు తెలిపారు. గ్రామ జ్యోతితోపాటు పట్టణాల అభివృద్ధికి పట్టణ జ్యోతిని కూడా చేపడతామని సీఎం ప్రకటించారు.